# ‘కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం’

## – రైతుకూలీసంఘం(ఆం.ప్ర) అనంతపురంజిల్లా మహాసభలో కా॥జె.కిశోర్‌బాబు



జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ జె.కిషోర్‌బాబు; మహాసభకు హాజరైన ప్రతినిధులు

**అనంతపురం, 5-5-16 :**

వ్యవసాయరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టడానికి రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతులు, రైతుకూలీలు సమైక్య పోరాటం చేయాలని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥జె.కిశోర్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక రజకనగర్‌లో జరిగిన రై.కూ.సం. జిల్లా మహాసభలు, జిల్లాకార్యదర్శి కా॥తిమ్మారెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలోని సమస్త రంగాలతో పాటు వ్యవసాయ రంగాన్ని విదేశీ పెట్టుబడిదారులకు ఎర్రతివాచి పరిచి దోచుకుపోయేందుకు అప్పగిస్తున్నారని దుయ్యబట్టారు. 2014నాటి తమ ఎన్నికల ప్రణాళికలో ‘జాబు రావాలంటే బాబు రావాల’ని ప్రచారాలు నిర్వహించి, అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగాలను తొలగించేశాడని అన్నారు. రైతు రుణమాఫీ, చేనేత రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి తదితర హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥పెద్దన్న మాట్లాడుతూ అనంతపురం జిల్లానుండి 4.20 లక్షలమంది బెంగుళూరు, చెన్నై, బొంబాయిలాంటి నగరాలకు వలసలువెళ్ళి కడు దుర్భర జీవితాలు గడుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. జిల్లాకు ప్రధాన జలాధారమైన హెచ్‌ఎల్‌సి కాలువద్వారా 32 టిఎంసిల నీరు రావాల్సివున్నప్పటికీ, ప్రస్తుతం 20 టిఎంసిలు కూడా రాలేకపోతున్నాయని, ఈ దుస్థితికి కారణం ప్రభుత్వ విధానాలేనని సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలోవున్న 1200 చెరువులను పూడికతీసి హంద్రీ జలాలతో నింపాలని అన్నారు. కదిరిలాటి ప్రాంతాలలో మహిళలను ప్రలోభాలకు గురిచేసి గల్ఫ్ దేశాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు.

బళ్ళారిజిల్లా నీటి పారుదల భూపరిరక్షణ సమితి అధ్యక్షులు, న్యాయవాది చాగనూరు మల్లిఖార్జున మాట్లాడుతూ మన హక్కులు మనం సాధించు కోవాలంటే తప్పక ఉద్యమాలు చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కా॥ పి.చంద్రశేఖర్ అధ్యక్షులుగా, కా॥ బి.తిమ్మారెడ్డి కార్యదర్శిగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

అనంతరం మహాసభ ఈ తీర్మానాలను చేసింది.

1. భూమిలేని పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు, దళిత కుటుంబాలకి వెంటనే ఒక్కొక్క కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున ప్రభుత్వ భూములను,
దేవాలయ భూములను అవసరమైనచోట పట్టా భూములను, కొనుగోలు చేసి ఇవ్వాలి.
2. హంద్రి-నీవా ప్రాజెక్టు పూర్తిచేయాలి. ఇప్పటి వరకు పూర్తి అయిన ప్రాంతాలలో ఉపకాలువలు పూర్తిచేసి ఆయకట్టుకు వెంటనే నీరందించాలి.
3. జిల్లాలోని 1200 చెరువులను మరమ్మత్తులు చేసి నదీ జలాలతో వెంటనే నింపాలి.
4. జిల్లాకు 100 టి.ఎం.సి.ల నదీ జలాలను కేటాయించాలి.
5. పి.ఎ.బి.ఆర్.లకు 10 టి.ఎం.సి.ల నికర జలాలను వాడుకలోకి తేవాలి.
6. సమాంతర కాలువ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవాలి. కాలువలు ఆధునీకరించి తుంగభద్ర ప్రాజెక్టు నుండి 32.5 టి.ఎం.సి.ల సాగునీరందించాలి.
7. శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలి. వలసలను ఆపాలి.
8. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన రైతు, చేనేత ఆత్మహత్యల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి. వారి కుటుంబాలలో ఒకరికైనా ఉద్యోగ వసతి కల్పించాలి.
9. చీనీ ఆధారిత, టమోట ఆధారిత అగ్రో పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి పెంచాలి.
10. హీరేహాల్ వద్ద లభించే శ్రేష్టమైన ఇనుప ఖనిజం ఆధారంగా రాయదుర్గం ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పాలి.
11. గార్మెంట్ పరిశ్రమలను నెలకొల్పి మహిళలకు ఉపాధి కల్పించాలి.
12. అర్హులైన పేదలందరికీ ఇళ్ళ స్థలాలను కేటాయించి పక్కా ఇళ్లను నిర్మించాలి.
13. వ్యవసాయం చేసుకొనే రైతులందరికీ సబ్సిడీతో సరిపడు వేరుశనగను సప్లయ్ చేయాలి.

oooooo